www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 ఏప్రిల్ 2024
8 పేజీలు

ఏలూరు
పశ్చిమ గోదావరి

కట్.. కట్..!

- గ్రామాల్లో ఎడాపెడా విద్యుత్ కోతలు
- ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం అవస్థలు
- రోజుకు మూడు నుంచి నాలుగు గంటలకుపైగా కోత
- నిడమర్రు వంటి పలు మండలాల్లో లోఓల్టేజీ సమస్య తీవ్రం
- వ్యవసాయానికి ఏడు గంటల సరఫరాతోనే సరి
- ఇన్వర్టర్లు, కూలర్ల కొనుగోలుకు జనం అప్పులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వేసవి తీవ్రత ప్రారంభం కాకముందే గ్రామాల్లో ఎడాపెడా కరెంటు కోతలు అమలవుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి రెండు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు గంటలు ఒక్కోసారి ఏడెనిమిది గంటలు సైతం కరెంటు కోత విధిస్తున్నట్లు జనం లబోదిబోమంటున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో అమలవుతున్న కరెంటు కోతలతో జనానికి ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. వేసవి ఆరంభంలోనే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న పరిస్థితి ఉంది. దీంతో ఎండ వేడిమికి తట్టుకోలేక జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 12 లక్షల వరకూ గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల కనెక్షన్లు సామాన్య ప్రజానీకానివే. కరెంటు కోతలకు తాళలేక ఇన్వర్టర్ల కొనుగోలుకు జనం పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పొలం పనులు చేసి ఇంటికొచ్చిన తర్వాత కరెంటు కోతలతో ఫ్యాన్లు తిరగక ఉక్కపోతకు జనం అల్లాడుతున్నారు. దీంతో చెట్ల కింద, ఆరు బయటే ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేయడంతో ఇళ్లలో సైతం వేడితీవ్రత ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఉక్కపోతకు పిల్లలు సరిగా నిద్రపోకపోవడంతో తల్లిదండ్రులు సైతం నిద్రలేని రాత్రుళ్లు గడపాల్సిన దుస్థితి నెలకొంది. కరెంటు కోతల సమస్య ఒకపక్క, పలు మండలాల్లో లోఓల్టేజీ సమస్య మరోపక్క జనాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నిడమర్రు మండలంలోని అడవికొలను వంటి మేజర్ పంచాయతీ గ్రామాల్లో సాయంత్రం ఏడు గంటల నుంచి లోఓల్టేజీ సమస్యతో ఫ్యాన్లు సరిగా తిరగడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. లోఓల్టేజీ సమస్యతో ఇన్వర్టర్లు ఉన్నవారు ఫ్యాన్లను వాటిపైనే తిప్పుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇన్వర్టర్లు లేని వారు తెల్లవార్లు ఫ్యాన్లు తిరగక నిద్ర లేమితో అల్లాడుతున్నారు. దీంతో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఇళ్లకు 24 గంటలు కరెంటు సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్న మాటలు వట్టిమాటలుగానే మిగిలిపోతున్నాయి. కరెంటు కోతలతో బాధలు పడలేక సామాన్య ప్రజానీకం సైతం అప్పు చేసి ఇన్వర్టర్లు ..6లో

నేడు తణుకులో ప్రజాగళం సభ

హాజరు కానున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - తణుకు

ప్రజాగళం ఎన్నికల సభ ఈ నెల పదో తేదీ బుధవారం పట్టణంలో నిర్వహించనున్నారు. ఈ సభకు టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ హాజరు కానున్నారు. హెలీకాప్టర్‌లో ఇరువురు నేతలు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణకు మధ్యాహ్నం 3.35 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డుషోగా 3.45కు నరేంద్ర సెంటర్‌కు చేరుకుంటారు. నాలుగు గంటల నుంచి ఐదున్నర గంటల వరకూ అక్కడ నిర్వహించే ప్రజాగళం సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం 5.45కు రోడ్డు మార్గంలో నిడదవోలు బయల్దేరి వెళ్తారు. రోడ్‌షో, సభలో కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మాజీ ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు.



మాట్లాడుతూ కన్నీటి పర్యంతమవుతున్న ఉండి ఎంఎల్ఎ రామరాజు

సిట్టింగులకే సీటు అని.. ఇప్పుడు మోసగిస్తారా

- కన్నీటిపర్యంతమైన ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు
- రామరాజుకు టిక్కెట్ కొనసాగించకపోతే మూకుమ్మడి రాజీనామాలు
- స్పష్టం చేసిన మండలస్థాయి నేతలు
- చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా: పరిశీలకుడు గన్ని

ప్రజాశక్తి - కాళ్ల

సిట్టింగులకే సీటు అని అనేకసార్లు చెప్పి ఇప్పుడు కాదని మోసగిస్తే ఎలాగని ఉండి ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి మంతెన రామరాజు కన్నీటి పర్యంతమయ్యారు. పెదఅమిరంలో టిడిపి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు ..6లో

జ్యూట్‌మిల్లు తెరవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొత్తూరు జ్యూట్‌మిల్లు మూసివేత అక్రమమని, ఆ మిల్లును వెంటనే తెరిచి కార్మికుల ఉపాధిని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత 20 సంవత్సరాలుగా నిరాటంకంగా నడుస్తున్న కొత్తూరు జ్యూట్‌మిల్లును నిన్నటి వరకు లేఆఫ్‌గా ప్రకటించి ఆదివారం నాడు మూసివేస్తున్నట్లు యాజమాన్యం బోర్డు పెట్టడం కార్మికుల బతుకులను రోడ్డున పడేయడమేనని పేర్కొన్నారు. ఈ చర్య వలన సుమారు రెండు వేల మంది కార్మికులు, వారి కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నారని, జ్యూట్‌మిల్లు మూసివేత చట్ట విరుద్ధమని, మూసివేతకు యాజమాన్యం చెబుతున్న కారణం సహేతుకం కాదని తెలిపారు. దీనికి ముందు 2022 జనవరి 26న ఏలూరు జ్యూట్‌మిల్లు మూసివేయడంతో అప్పుడు సుమారు ఐదు వేల మంది కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డునపడ్డాయని, నేడు కొత్తూరు జ్యూట్‌మిల్లు కూడా మూసివేయడంతో ఏలూరులో ఉన్న ఏకైక పెద్ద పరిశ్రమలు ఇక లేవని పేర్కొన్నారు. ఏలూరులో ఉండే నివాసుల్లో జ్యూట్ పరిశ్రమల్లో పని చేసేవారు, ఆ పరిశ్రమను ఆధారంగా చేసుకుని ఇతర ఉపాధి పనులు చేసుకునేవారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. గతంలో ఉపాధి కోసం, పనుల కోసం శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి తదితర ప్రాంతాల నుండి వలస వచ్చి ఏలూరులో స్థిరపడిన వారు ఉండేవారని, ఇప్పుడు ఏలూరులో అతిపెద్ద పరిశ్రమలుగా ఉన్న రెండు జ్యూట్‌మిల్లులు మూసివేయడంతో ఏలూరు నుండి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు పరిశ్రమలు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ఉన్నప్పుడే మూసివేశారని, వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిగ్గా స్పందించలేదని విమర్శించారు. వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలను రోడ్డున పడే దుస్థితికి వచ్చిన జ్యూట్‌మిల్లుల మూసివేతపై అధికార వైసిపి ఎంఎల్ఎగాని, రేపు తామే అధికారంలోకి వస్తామని చెబుతున్న ప్రతిపక్షపార్టీలు ..6లో

తాగునీరు ఆక్వా చెరువులకు మళ్లిస్తే చర్యలు
3లో..

దిగ్గజాల గడ్డ.. ఉంగుటూరు
మధ్యపేజీల్లో

వేర్వేరుచోట్ల రూ.8.35 లక్షలు స్వాధీనం
8లో..

రూ.12.45 కోట్లు విలువైన నగదు, వస్తువులు సీజ్

- సువిధ ద్వారా 691 అభ్యర్థనలకు అనుమతులు
- ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, ఉచిత సామగ్రి పంపిణీ తదితరాలను నిరోధించే నిమిత్తం జిల్లావ్యాప్తంగా 45 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, 28 స్టాటిక్ సర్వేలైన్స్ టీములతోపాటు రాష్ట్ర సరిహద్దుల వద్ద 10 ఎస్-ఎస్‌టి బృందాలతో పటిష్టమైన నిరంతర నిఘా ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎఫ్ఎస్‌టి, పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ జిల్లావ్యాప్తంగా మొత్తం రూ.12.45 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని పేర్కొన్నారు. దీనిలో రూ.151.61 లక్షలు నగద, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.71.53 లక్షల విలువైన 27,880 లీటర్ల మద్యం స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు.

జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ, ఎన్‌కోర్ ద్వారా అందిన అభ్యర్థనల్లో ఇంతవరకూ 691 అనుమతులు ఇచ్చామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా సోమవారం రాత్రి వరకూ 1,015 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకూ 691 అనుమతులు జారీ చేయగా మరో 21 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. సరైన రీతిలో లేని 303 దరఖాస్తులను తిరస్కరించామని పేర్కొన్నారు. సి-విజిల్ ద్వారా 287 ..6లో

కాంగ్రెస్‌ను ఆదరించాలి : నోబుల్

ప్రజాశక్తి - కైకలూరు

కాంగ్రెస్‌ని ప్రజలు ఆదరించాలని, కేంద్రంలోని అసమర్థ బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ కైకలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ కోరారు. ఆయన నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి నేతలను కలిశారు. పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, దేశాభివృద్ధికి పాటుపడిన కాంగ్రెస్‌ని ప్రజలు మరోసారి ఆదరించాలన్నారు. ప్రజలు హస్తం గుర్తుపై ఓటు వేసి విజయాన్ని చేకూర్చాలని ఆయన ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు లాజరు, ఇసాక్, సైమన్ రాజ్, ఆదాం, అలెక్స్ పాల్గొన్నారు.

'రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం'

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని వలసపల్లి గ్రామానికి చెందిన చలసాని ఉదయ్ భాస్కర్, వేంపటి గోవర్ధన్, దేవినేని శ్రీధర్, కాజా సీతారామయ్య, కూరపాటి నాగేశ్వరరావు, కాట్రు నాగేశ్వరరావు, పాటిబండ్ల శ్రీరామమూర్తి, పల్లగాని శ్రీనివాసరావు, అజయ్ కుమార్ ఇలా 20 కుటుంబాల వైసిపి నాయకులు టిడిపిలోకి చేరడంతో నూజివీడు నియోజకవర్గంలో, రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. టిడిపి నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి కొలుసు పార్థసారథి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేసి నూజివీడు నియోజకవర్గంలో టిడిపిని గెలిపించి, చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న మహేష్

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు బట్టలు, నిత్యావసర సరుకులు, మధ్యాహ్నం భోజనంను టిడిపి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి పండుగలన్నీ అద్భుతంగా ఉంటాయన్నారు. వాటిలో ఉగాది తీరే వేరని, ఉగాది పండుగ అంటేనే షడ్రుచుల సమ్మేళనం అని అన్నారు. ఉగాది పచ్చడి మన జీవితంలోని కష్టాలు, సుఖాలు, ఆనందాలు, బాధలు అన్నింటికీ ప్రతీక కావచ్చన్నారు. ఉగాది పేరులోనే యుగ ఆది అనే అర్థం ఉంది అని, అంటే సంవత్సరం ప్రారంభం అని అర్థం అని అన్నారు. మన తెలుగు వారికి ఉగాదితోనే సంవత్సరం ప్రారంభమవుతుందని, అందరి జీవితాల్లో ఈ కొత్త సంవత్సరంలో ఆనందాలు వెదజల్లాలని తెలిపారు.

ద్వారకాతిరుమలలో వనిత ప్రచారం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

వైసిపి గోపాలపురం నియోజవకర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి తానేటి వనిత మంగళవారం సాయంత్రం ద్వారకాతిరుమలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యాదవ కాలనీ, ఎస్‌సి కాలనీల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆమె పాల్గొన్నారు. అఖండ మెజారిటీతో గోపాలపురం నియోజవర్గంలో గెలిపించాలని కోరారు. గుండుగొలను కుంట దొరసానిపాడు గ్రామాలలో కూడా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొండాడ మోహినీ వెంకన్న బాబు, వైసిపి మండల నాయకుడు చెలికాని రాజబాబు పాల్గొన్నారు.

వికలాంగులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

ఉగాది పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం ప్రముఖులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా గుండుగొలను గ్రామానికి చెందిన శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో స్థానికంగా గల 60 మంది వికలాంగులకు సన్నబియ్యం, పండ్లు, పౌష్టికాహారం, దుస్తులతో పాటు బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వీటిని స్థానికులు, వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా విశ్రాంత ఆరోగ్య అధికారి వగ్వాల హరి మాధవరావు, సూర్యకుమారి దంపతులు సమకూర్చారు. వీరికి అదనంగా స్థానిక శ్రీవిద్యాలయ ఉన్నత పాఠశాల(ప్రయివేట్)కు చెందిన ఉపాధ్యాయిని ఒకరు సంస్థ నిర్వహణ కోసం రూ.10వేల నగదును విరాళంగా అందజేశారు. ఇదే క్రమంలో సేవాసమితి నిర్వాహకులు పి.శ్యామలరాజు ఆధ్వర్యంలో దాతలను, సేవాసమితి తరపున చేపడుతున్న సేవా కార్యక్రమాలకు బియ్యం సరఫరా చేస్తున్న ఏలూరుకు చెందిన బియ్యం వ్యాపారి మద్ది మల్లికార్జునరావును సత్కరించారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పూళ్ళ గ్రామంలో పర్యటించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పొలసానిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచి షేక్ రహీమా బేగం హసేన ఆధ్వర్యంలో ఉగాది ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, ప్రముఖులతో కలిసి ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉగాది శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు రానున్న ఎన్నికల్లో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబును ఎంఎల్‌ఎగా ఎన్నికయ్యేందుకు సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కోట శంకరం, మాజీ ఉపసర్పంచి ఎ.నాగేంద్రప్రసాద్, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

ఉగాది సంబరాలు నిర్వహిస్తున్న గ్రామ సర్పంచి

వ్యవసాయ మీటర్ల బిగింపుపై ప్రతిఘటించాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు రైతుల మెడలకు ఉరితాళ్లు అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఏలూరు పవర్ పేట అన్నే భవనంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపుపై నిర్వహించిన సమావేశంలో రైతు సంఘం నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని ముసునూరు మండలం రమణక్కపేటలో విద్యుత్ శాఖ అధికారులు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడమే కాకుండా ఆ మీటర్లు రైతులు పీకివేస్తే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని బెదిరించడం అన్యాయమని విమర్శించారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు వల్ల భవిష్యత్తులో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు కాదని చెప్పారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జిఓ 22ను తీసుకొచ్చి వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తోందని అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా రైతులు సాధించుకున్న ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఉచిత విద్యుత్ పథకాన్ని యథావిధిగా అమలు చేయకుండా నగదు బదిలీ పేరుతో రైతులను మోసగించడం తగదన్నారు. ఒకవైపు ఎన్నికల కోడ్ ఉండగా మీటర్లు ఎలా బిగిస్తారని విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. రైతులను భయపెట్టి మీటర్లను బిగించడం ఆపాలన్నారు. గ్రామాలకు విద్యుత్ అధికారులు వచ్చి మీటర్లు బిగిస్తే రైతులు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ అధికారులు బిగించిన మీటర్లను పీకివేసేందుకు రైతులు సమాయత్తం కావాలన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు పాల్గొన్నారు.

బిసిల ఆర్థికాభివృద్ధికి దోహదం

ఎంఎల్‌ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి

ముసునూరు: టిడిపి అధికారంలోకి రాగానే బిసిలందరికీ ప్రత్యేక పథకాలు చేపట్టి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే 50 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తికీ ఫించన్ ఇస్తామన్నారు. అదేవిధంగా మహిళలకు ప్రతినెలా రూ.1500లు, గతంలో వలే ప్రతి విద్యార్థి చదువు పూర్తయ్యే వరకూ ఫీజు రియంబర్సుమెంట్ ఇవ్వడం, ఒక ఇంట్లో ఎంత మంది చదువుకున్నా అందరికీ అమ్మఒడి రూ.15 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ బండలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - చింతలపూడి

పవిత్ర రంజాన్ పండుగను పేద ముస్లింలు సైతం సంతోషంగా జరుపుకోవాలి అన్న తలంపుతో ఫిత్రా దానం ద్వారా రెండు వందల మంది పేద మహిళలకు, పురుషులకు రూ.80 వేల విలువ గల వస్త్రాలు జమాత్ ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేసినట్లు పట్టణ జమాత్ ఇస్లామీ హింద్ అధ్యక్షుడు ఎస్‌కె.హుస్సేన్ తెలిపారు. జామియా మసీదు కమిటీ, జమాత్ ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ముస్లింల నుంచి వసూలు చేసిన ఫిత్ర దాన సొమ్ముతో పేద ముస్లిం మహిళలు, పురుషులకు, యువతులు రెండు వందల మందికి వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మసీదు కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ రహీమ్, జమాత్ ఇస్లామీ హింద్ అధ్యక్షుడు హుస్సేన్‌లు మాట్లాడుతూ యాబై ఏళ్ల నుంచి జమాత్ ఇస్లామీ హింద్, జామియా మసీదు కమిటీల ఆధ్వర్యంలో ఫిత్రా దానం ద్వారా పేదలకు దుస్తుల పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ కార్యదర్శి ఎమ్‌డీ జిలానీ, ముస్లిం పెద్దలు ఎం.ఎ.రజాక్, ఖిజర్ పాషా, ఇషాక్, గఫార్, ఫారూఖ్, సుభాని, జవహర్, యాకూబ్ పాల్గొన్నారు.

దుస్తులు అందజేస్తున్న ముస్లిం పెద్దలు

రాజేశ్వరరావు స్ఫూర్తితో ముందుకు సాగాలి

కామవరపుకోట: రాజేశ్వరరావు విద్యార్థి ఉద్యమం నుంచి పోరాటాలకు శ్రీకారం చుట్టి, సిపిఐ జాతీయ కార్యదర్శిగా సేవలందించి, తనదైన శైలిలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా పనిచేశారని సిపిఐ మండల కార్యదర్శి టివిఎస్ రాజు అన్నారు. కీర్తిశేషులు చండా రాజేశ్వరరావు 30వ వర్ధంతి సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సిపిఐ మండల కార్యదర్శి టివిఎస్ రాజు రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో రాజు మాట్లాడుతూ చల్లపల్లి జమిందార్ చేతిలో ఉన్న 3 ఎకరాల మిగులు భూమిని భూమి లేని పేదలకు పంచడం కోసం దాసరి నాగభూషణ రావుతో కలిసి భూములు ఆక్రమించి పేదలకు పంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చల్లపల్లి భూ పోరాట స్ఫూర్తితో చింతలపూడి తాలూకా బొర్రంపాలెం, వీరభద్రవరం, కామవరపుకోట, తడికలపూడి, వీరంపాలెం తదితర గ్రామాల్లో భూ పోరాటాలు చేసి భూమిలేని పేదలకు పంచామని, రాజేశ్వరరావు స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. సిపిఐ, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

విద్యుత్ లైన్లకు మరమ్మత్తులు చేయు నిమిత్తం ఈనెల 10వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్, ఏలూరు జెపిబి.నటరాజన్ తెలిపారు. ఏలూరు సౌత్ సెక్షన్ 33/11 కేవీ వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలో వున్న 33 కేవీ వంగాయగూడెం వెంకన్న ట్యాంక్ ఫీడర్, పవర్ పేట సెక్షన్ 33/11 కేవీ ఏలూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ వెంకన్న ట్యాంక్, 11 కేవీ పోణంగి ఫీడర్‌కు ట్రీ కట్టింగ్, లైన్లకు మరమ్మతు చేయుటకు ఈనెల 10వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వెంకన్న ట్యాంక్, ఏలూరు సబ్ స్టేషన్ పరిధిలోని పడమర వీధి, దొంగలమండపం, బ్రహ్మం గారి గుడి, చిరంజీవి బస్టాండ్, ఆముదాల అప్పలస్వామి కాలనీ, జ్వాల పరమేశ్వర కాలనీ, దక్షిణపు వీధి, వెంకన్న చెరువు ఏరియా, తూర్పు వీధి, కొత్తగూడెం సెంటర్, ఫిలహౌసే పేట, వీవర్స్ కాలనీ, చాటపర్రురోడ్, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, ప్రజలు గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

భోగారావుకు పరామర్శ

ప్రజాశక్తి - చింతలపూడి

ఇటీవల అనారోగ్యానికి గురైన రాఘవపురం సొసైటీ ప్రెసిడెంట్ గిరి భోగారావుని మాజీ ఎఎంసి ఛైర్మన్ మేడవరపు అశోక్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గిరి బెనర్జీ, రెమో పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారంలో కవురు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి వైసిపి ఎన్నికల ప్రచారానికి ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పాల్గొననున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి తెలిపారు. ఈనెల 10వ తేదీ బుధవారం చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయరాజు, వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్ యాదవ్, గోరుముచ్చు గోపాల్ యాదవ్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ ఉదయం 9 గంటలకు శెట్టివారిగూడెంలోని ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పర్యటన ప్రగడవరం గ్రామంలో ముగుస్తుందని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పలు ప్రాంతాల్లో ముద్దరబోయిన ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - ముసునూరు

వాడుకుని వదిలివేయడంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడును మించిన వారు మరొకరు లేరని మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ముసునూరు మండలం చెక్కపల్లి, లోపూడి, గుళ్లపూడి, వలసపల్లి గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకర్తల అభీష్టం మేరకు తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. నూజివీడు నియోజకవర్గంలో ప్రతి సమస్యపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని, స్వతంత్ర ఎంఎల్‌ఎగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముద్దరబోయిన హామీ ఇస్తే అది చేసి తీరుతాడని, కానీ కొందరు నాయకులు ఇచ్చిన హామీలు సంవత్సరాల పాటు ఆ హామీలు హామీలుగానే మిగిలాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ముద్దరబోయిన

ముఖ్య వార్తలు

బుధవారం 10 ఏప్రిల్ 2024

'ప్రజలంతా సంతోషంగా ఉండాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని చింతలపూడి మాజీ ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. చింతలపూడిలోని టిడిపి కార్యాలయంలో నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం ఆధ్వర్యంలో క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, టిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయ్, మాజీ సర్పంచి చిట్లూరి ధర్మరాజు, జనసేన మండల మహిళ కార్యదర్శి గుమ్మిశెట్టి భారతి, తిరుమిల్లి రామారావు, ముల్లగిరి సుందరమ్మ, మద్రిపూడి నాగేశ్వరమ్మ, నందిపాము నాగేశ్వరరావు, కర్లపూడి రాజారత్నం, రావెళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నోబుల్

నోబుల్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని లంక గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు నోబుల్ విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లోని నాయకులతో పాటు సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావును కలిశారు. స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. కరపత్రాలను పంపిణీ చేశారు. అంద్రాజు దుర్గారావు, సిరింగి జల్నా రాయుడు, చాటత్రిన బెనర్జీ, కె.శ్రీనివాసరావు, సిహెచ్.విఠల్ బాబు, గెడ్డం కృష్ణ, బెజవాడ సువర్ణ రాజు, మహాదేవ సాయిబాబు పాల్గొన్నారు.

ముద్దరబోయినకు మద్దతు

ప్రజాశక్తి - నూజివీడు

టిడిపి కార్యకర్తకు అండగా నిలబడిన మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయినకే ఇక్కడ టిడిపి కార్యకర్తల మద్దతు ఉందని కొండా మంగయ్య అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు మంగళవారం టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కొండా మంగయ్య, నూజివీడు నియోజకవర్గ టిడిపి ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి జన్ని రాంబాబు, ఆగిరిపల్లి మండల టిడిపి ఉపాధ్యక్షుడు గండికోట రంగారావు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు కలవకొల్లు ప్రసాదు, ఆగిరిపల్లి మండల టిడిపి నాయకులు మల్లవల్లి మురళీ తదితరులు మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు మద్దతు తెలిపారు.

జనసేన నేతల రాజీనామా

ప్రజాశక్తి - కైకలూరు

నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బివి రావు జనసేన ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు సీనియర్ నాయకులు కోటా విప్లవ వరప్రసాద్, నాగనబోయిన విజయకుమార్, జనసేన 2019 కైకలూరు చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ డాక్టర్ బుసనబోయిన శివరామకృష్ణ యాదవ్, జూజల శ్రీనివాస్, పటాకుల రమేష్, ముఖేష్, బి.బాబీ, తానింకి సతీష్, తదితర జన సైనికులు, నాయకులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ జనసేన పార్టీ నిర్వీర్యానికి కృషి చేస్తున్నారని వారు ఆరోపించారు. కైకలూరులో జనసేన అంతం కామినేని పంతంగా మారిందని, జనసేన టిడిపి కనుసన్నల్లో నడుస్తుందని, గత పది సంవత్సరాల నుంచి జనసేనలో నిజాయితీగా పనిచేస్తూ జనసేనని మోస్తున్న అసలు సిసలైన నాయకులకు ప్రాధాన్యత లేదన్నారు. ఉగాది సందర్భంగా తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని బివి రావు తెలిపారు.

తాగునీరు ఆక్వా చెరువులకు మళ్లిస్తే చర్యలు

ఎంపిడిఒ ఎన్.ఎం.గంగాధర్ రావు

ముదినేపల్లి: సిబికెనాల్ ద్వారా తాగునీటి అవసరాల కోసం సరఫరా చేస్తున్న మంచినీటిని ఆక్వా రైతులు చేపల, రొయ్యల చెరువులకు మలిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ ఎన్.ఎం.గంగాధర్ రావు అన్నారు మంగళవారం మండలంలోని సిబి కెనాల్‌ను ఆయన పరిశీలించారు. సిబి కెనాల్‌కు సోమవారం సాయంత్రం నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో కలిసి ఆయన సిబి కెనాల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలువ ద్వారా నీరు కలిదిండి మండలం శివారు గ్రామాలకు వెళుతుందన్నారు. కాలువల ద్వారా మంచినీటి చెరువులకు సరఫరా చేస్తున్న నీటిని ఎవరైనా ఆక్వా రైతులు పక్కదారి మళ్లించి చేపల చెరువులకు ఆయిల్ ఇంజన్లతో తోడితే వారిని ఉపేక్షించేది లేదన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున తాగునీటి అవసరాల కోసమే నీటిని శివారు గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. నీటి చౌర్యం జరక్కుండా 24 గంటల పాటు నిఘా కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ గంగాధర్ రావు తెలిపారు. ఆయన వెంట ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ, జలవనరుల శాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, విఆర్ఒలు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

సమాజంలో ప్రతిఒక్కరూ ఓటుహక్కు తప్పక వినియోగించుకోవాలని కోరుతూ మంగళవారం మండలంలో కళాజాత నిర్వహించారు. ఎంపిడిఒ ఎన్ఎమ్.గంగాధర్ రావు, ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని గురజ, ముదినేపల్లి గ్రామాల్లో కళాజాత బృందం సభ్యులు వై.వీరయ్య, వై.రవితేజలు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు రాజ్యాంగం మనం కల్పించిన హక్కు కాబట్టి ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించి ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ప్రలోభాలకు, మద్యానికి, డబ్బుకి వివిధ రకాల బహుమతులకు లొంగకుండా విలువలతో కూడిన ఓటింగ్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గురజ, ముదినేపల్లి సచివాలయ ఉద్యోగులు హరిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుని, దేశ భవిష్యత్తును నిర్మించుకోవాలని బంజారా బజరంగీ భేరి ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ నాయక్ అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో మంగళవారం బంజారా

ముదినేపల్లి: అవగాహన కల్పిస్తున్న బృందం

బజరంగీ భేరీ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి జరభల పున్నయ్య నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నేటికి 30 నుంచి 40 శాతం మంది ప్రజలు ఎన్నికల్లో వినియోగించి భాగస్వామ్యం కావడం లేదన్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం అన్నారు. ప్రజాస్వామ్య రక్షణలో భాగంగా ఓటు హక్కు వినియోగం మన అందరి బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజల్లో ఓటు హక్కు విలువపై అవగాహన కల్పించడం కోసం బంజారా బజరంగీ భేరి సంఘం, గ్రామాల కూడళ్లలో బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నామని సంఘ అధ్యక్షులు జరభల చందా నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్ బంగారయ్య, భూక్యా సత్యం పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ కృషి అభినందనీయం

డాక్టర్ అలుగు ఆనంద శేఖర్

జంగారెడ్డిగూడెం టౌన్: తెలుగువారి పండుగ ఉగాది అని, దీన్ని హిందూ పండుగగా భావించకూడదని ప్రియదర్శిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అలుగు ఆనంద శేఖర్ అన్నారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ పాత్రికేయుల సంక్షేమానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని స్థానిక ప్రియదర్శిని కళాశాలలో మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా ఎపిడబ్ల్యూజెఎఫ్‌లో జిల్లా పదవులు పొందిన పాత్రికేయులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని కళాశాల సెక్రటరీ అండ్ కస్పాండెంట్ డాక్టర్ అలుగు ఆనంద శేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ విధంగా అందరూ సంఘటితంగా ఉండాలని, సామాజిక మార్పు కోసం కృషి చేయాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కొత్తూరి రవి కిరణ్, సహాయ కార్యదర్శి కలపాల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు కడిమి రాజేష్, డి.లోకేష్‌లను, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ కడలి గాంధీని యూనియన్ నాయకులు, ప్రముఖులు ఘనంగా సత్కరించారు.

పశువుల అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పశువులను కబేలాలకు తరలిస్తూ కొందరు అక్రమార్కులు లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. మండలంలోని బెస్తగూడెం గోదావరి రేవుకు అటువైపునున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండల పరిధిలోని కుమారస్వామి గుట్ట రేవు నుంచి నాటు పడవ ద్వారా అర్ధరాత్రులు 68 శాల్తీల పశువులను బెస్తగూడెం గోదావరి రేవుకు తరలించి రేవు సమీపంలోని సీతారాంపురం గ్రామ శివారులోని చెరువు కట్ట వద్దకు తరలించి, ఎవరి కంటా పడకుండా గోదావరి రేవు సరిహద్దు గ్రామాల మీదుగా కబేలాలకు తరలించేందుకు యత్నించగా, సీతారాంపురం గ్రామానికి చెందిన వ్యక్తులు పశువుల అక్రమ రవాణా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పశువుల అక్రమ రవాణాను అడ్డుకొని పశువులను, అక్రమంగా పశువులను కబేలాలకు తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ముస్లిం మైనారిటీలపై వేధింపులు అరికట్టాలి

ఏలూరు టౌన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ముస్లిం మైనారిటీ ఉద్యోగులపై వివక్షతో కూడిన కక్షసాధింపులు చేస్తుండటాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు ఆక్షేపించారు. పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని, ప్రతి సంవత్సరం ప్రభుత్వం వారు సదరు ఉద్యోగులకు ఒక గంట ముందు విధుల నుంచి వెళుటకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చెయ్యడం ఆనవాయితీగా జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా జిఎడి విభాగం ఒక గంట అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చెయ్యడం జరిగిందని తెలిపారు. సదరు ఉత్తర్వులను అనుసరించి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే ముస్లిం ఉద్యోగులకు ఒక గంట సమయం మినహాయింపుతో కూడిన ఆదేశాలు ఇవ్వకుండా జిల్లా అధికారి ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేయడం జరిగినట్లు మా పరిశీలనలో తెలిసిందన్నారు. వివాదాస్పద వివక్షతో కూడిన అవాంతరాలు కలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసే విధానం సరైనది కాదని హెచ్చరించారు.

నేరాలు - ఘోరాలు

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

మహిళపై అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఫోన్ చేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైందని ఎస్ఐ పి.వాసు తెలిపారు. వివరాల్లోకెళితే.. మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన కోరు రత్న కుమార్ అదే గ్రామానికి చెందిన మహిళతో దురుసుగా మాట్లాడటం, పలు ఇబ్బందులకు గురిచేయడం, ఇంటికొచ్చి గొడవ చేయటంతో ఆమె ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్ఐ పి.వాసు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిలువుదోపిడీకి పాల్పడ్డ ముద్దాయిలు అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పొట్టకూటి కోసం సొంత ఊరు, కుటుంబాన్ని వదిలి జీవనోపాధి నిమిత్తం వెళ్లిన వ్యక్తి క్షేమంగా గంటలో ఇంటికి చేరదామనే లోపే ఆటోవాలాలు నిలువు దోపిడీ చేశారు. ఈ ఘటన ఈనెల రెండో తేదీన భీమవరంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో భీమవరం డిఎస్‌పి వి.నారాయణస్వామి వెల్లడించారు. భీమవరం మండలం తోక తిప్ప గ్రామానికి చెందిన పొన్నాల వీర్రాజు మూడు సంవత్సరాల క్రితం మస్కట్ దేశం ఉపాధి కోసం వెళ్లినట్లు తెలిపారు. అయితే ఈనెల రెండో తేదీన హైదరాబాద్ చేరుకుని అక్కడి నుంచి బస్సు ద్వారా భీమవరం చేరుకునేసరికి రాత్రి 11 అయింది. అంబేద్కర్ సెంటర్‌కి వచ్చిన వీర్రాజు అక్కడే ఉన్న ఆటో డ్రైవర్ చింతాడ జయరాజు, జల్లి సురేంద్రలతో తోక తిప్ప వెళ్ళాలని చెప్పడంతో రూ.500 అవుతుందని జయరాజు చెప్పాడు. కిరాయికి ఒప్పందమై వీర్రాజుని ఎక్కించుకుని బైపాస్ రోడ్‌లో టిఫిన్ చేసి వెళ్లిపోదామని చెప్పడంతో వీర్రాజు సరే అన్నాడు. ఆటో డ్రైవర్ ఆటోను బైపాస్ రోడ్ నుంచి మెంటే వారి తోట వైపుకు తీసుకెళ్లి బీరు సీసాతో తలపై కొట్టడంతో పడిపోయిన వీర్రాజు వద్ద ఉన్న వస్తువుల్ని దోచుకుని పరారయ్యారు. బాధితుడు ఫిర్యాదు మేరకు సిఐ అడబాల శ్రీనివాస్ కేసు నమోదు చేసి ముద్దాయిలను బైపాస్ రోడ్‌లో మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1200 నగదు, పాస్‌పోర్ట్ మస్కట్‌కు చెందిన నాలుగు స్మార్ట్ వాచీలు, 69 ఫుల్ మద్యం బాటిళ్లు, చాక్లెట్ ప్యాక్స్ ఐదు, బాదంపప్పు ప్యాకెట్స్, చిన్నారి బట్టలు పోలీసులు రికవరీ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ముసునూరు

పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోపవరం గ్రామంలో రహస్య ప్రదేశంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్దవున్న రూ.1200 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట ఆడినా, చూసినా వారిపై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

పందెంరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని సిద్దాపురంలోని ఊరు చివరి ప్రాంతంలో కోడిపందేలు వేస్తున్న ఐదుగురు వ్యక్తుల్ని ఆకివీడు పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఐదుగురు వ్యక్తులను, ఒక కోడి కత్తిని, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదే సిద్దాపురం శివారు కురుపాక గ్రామంలో కోడిపందేలు ఆడుతున్న మరో ఐదుగురు వ్యక్తులను, రెండు కోళ్ళు, రెండు కోడి కత్తులు, రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'జగన్‌ను మళ్లీ గెలిపించాలి'

చింతలపూడి : ఇప్పటివరకు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం మండలం బోగోలు గ్రామపంచాయతీ పరిధిలో వైసిపి సీనియర్ నాయకులు ఇనుగంటి సతీష్ బాబు, పంచాయతీ సర్పంచి తాడేపల్లి శాంతారావుల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

వైసిపిని మళ్లీ ఆశీర్వదించాలి : స్వాతి

ముదినేపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని మళ్లీ ఆశీర్వదించి ఘన విజయం అందించాలని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కోడలు దూలం స్వాతి అన్నారు. మంగళవారం మండలంలోని చేవూరు పాలెం గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

తొమ్మిది విభాగాలతో నిరంతరం విధులు

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కలెక్టరేట్‌లో ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అందరికీ తెలియజేయడం, ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం కోసం ఈ కంట్రోల్ రూమ్ పని చేస్తోంది. దీనిలో సుమారు తొమ్మిది విభాగాలున్నాయి. సి విజిల్, కాల్ సెంటర్, మీడియా మోనిటరింగ్, సోషల్ మీడియా మోనిటరింగ్, కంప్లైట్స్ మోనిటరింగ్, వాహనాల పర్యవేక్షణ (జిపిఎస్ ట్రాకింగ్) తదితర విభాగాలున్నాయి. ఈ విభాగాలన్నింటికీ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వారి నేతృత్వంలో ఆయా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. సి.విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, ఎన్నికల కమిషన్ సైట్‌లో నమోదైన ఫిర్యాదులు, వివిధ పత్రికల్లో వచ్చిన ప్రతికూల వార్తలను గమనించి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపిస్తున్నారు. అలాగే గ్రీవెన్స్ కాల్ సెంటర్‌లో (టోల్ ఫ్రీ నం.1950), 9491041435, టోల్ ఫ్రీ నం 1800 233 1077కు వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. వెబ్ కాస్టింగ్ ద్వారా వివిధ చెక్ పోస్టుల వద్ద స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్‌లు చేస్తున్న తనిఖీలు పరిశీలిస్తారు. కంట్రోల్ రూమ్, ఎక్స్ పెండిచర్ మోనిటరింగ్, కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, పోలింగ్ ప్రక్రియ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వాహనాల పర్యవేక్షణ పరిశీలించి తగిన సమాచారాన్ని సేకరించి (జిపిఎస్ ట్రాకింగ్), వెబ్ క్యాస్టింగ్ విభాగాలు పంపిస్తారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ విభాగాలున్నాయి. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఆయా విభాగాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేస్తూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు.

ఓటర్లను ప్రలోభ పెట్టకుండా పటిష్ట చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్లను ప్రలోభ పెట్టే మద్యం, నగదు, బహుమతులు వంటి పంపిణీని కట్టుదిట్టంగా అరికట్టడానికి పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ ద్వారా నగదు, మద్యం, మాదకద్రవ్యాలను కఠినంగా అరికట్టేందుకు నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. జిల్లా సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టారని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీముల తనిఖీలు మరింత పెంచినట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు ప్రచారానికి ముందస్తు అనుమతులు తప్పనిసరని తెలిపారు. మద్యం విక్రయాల్లో 30 శాతం పెరిగితే సంబంధిత దుకాణాలు గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించేలా ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుండి మద్యం దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నిబంధనల మేరకు విక్రయాలు జరుగుతున్నాయా లేదా అనే అంశాలపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తనిఖీల్లో పట్టుబడితే ఎన్నికల నిబంధనలకు లోబడి కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్‌కు అనుబంధంగా పనిచేస్తున్న అధికారులంతా మరింత చురుగ్గా పనిచేయాలని తెలిపారు. రైళ్లు, ఆర్‌టిసి బస్సుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలతో తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు.

మామ కోసం మేనల్లుడు ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

మామ కోసం అల్లుడు ఎన్నికల ప్రచారం చేపట్టారు. మామ కోసం అల్లుడు, తండ్రి కోసం కొడుకు కలిసి నరసాపురం మండలంలోని కొప్పర్రు గ్రామంలో ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అల్లుడు అడ్డూరి అనిర్విన్, కొడుకు ముదునూరి శ్రీ కృష్ణంరాజు పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ఐదేళ్ల పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అభివృద్ధిని చూసి ఓటేయాలన్నారు. పేదరికం అనే మహమ్మారిని జయించాలని సిఎం జగన్ అనేక పథకాలను ప్రజల కోసం ప్రవేశపెట్టారని తెలిపారు.

మండలంలోని చామకూరి పాలెం పంచాయతీ మోడీ గ్రామంలో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ తెలిపారు. నియోజకవర్గ వైసిపి నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొప్పర్రులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బావ, బావమరిది

చాలా సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని కాటన్ పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దామని ముదునూరి శారదా వాణి అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో ఎంఎల్ఎ సతీమణి పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేపట్టారు. 29వ వార్డులో కమ్యూనిటీ హాళ్లు, రోడ్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్రి శ్రీ వెంకట రమణ, కామన బుజ్జి, మెర్లిన్ పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

నరసాపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ

ప్రజాశక్తి - నరసాపురం

ఎండల నేపథ్యంలో ప్రజలు వీలైనంత వరకూ ఇంట్లోనే ఉండాలని, బయటకెళ్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని నరసాపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ అన్నారు. మంగళవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. బయటకెళ్లేటప్పుడు టోపీ, గొడుగు ధరించాలన్నారు. తెలుపురంగు కాటన్ వస్త్రాలు ధరించాలన్నారు. ఎండలో నుంచి వచ్చాక నీరు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్, మజ్జిగ, ఒఆర్ఎస్ వంటివి తీసుకోవాలన్నారు. కూల్ డ్రింక్స్, జంక్ ఫుడ్, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. దాహం వేసినా, వేయకపోయినా నీరు తాగాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తల తిరగడం, వాంతులు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది తదితర సమస్యలు వస్తే వడదెబ్బగా గుర్తించి వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఎవరైనా వడదెబ్బ బారిన పడితే 108కి సమాచారం అందించాలన్నారు.

దిగ్గజాల గడ్డ.. ఉంగుటూరు..

చారిత్రాత్మక సర్వోదయ సమ్మేళనం నిర్వహించిన ఖ్యాతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గం 1962కు ముందు ఏర్పడింది. తొలినాళ్లలో ఉంగుటూరు, భీమడోలు, ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాలు ఈ నియోజకవర్గంలో ఉండేవి. అనంతరం 2009 ఎన్నికలకు ముందు నియోజకవర్గాల పునర్విభజనలో ఈ నియోజకవర్గం నుంచి ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాలను తప్పించి గణపవరం, నిడమర్రు మండలాలను ఇందులో కలిపారు. ఈ నియోజకవర్గంలో తొలినాళ్లలో కొంతవరకూ నల్లజర్ల, గణపవరం సమితిల్లో అంతర్భాగంగా ఉండేవి. 1983లో టిడిపి ఆవిర్భావంతో ఏర్పడిన ఎన్‌టి.రామారావు ప్రభుత్వం 1985లో మండల వ్యవస్థను తీసుకొచ్చింది. గణపవరం సమితిలో ఉంగుటూరు మండలంలో డెల్టా ప్రాంతానికి చెందిన కొన్ని గ్రామాలు, నల్లజర్ల సమితి మెట్ట ప్రాంతానికి చెందిన పలు గ్రామాలు ఉండేవి. మండల వ్యవస్థ ఏర్పడ్డాక గణపవరం, నల్లజర్ల సమితుల్లో ఉన్న గ్రామాలన్నింటినీ ఉంగుటూరు మండలంలో కలిపారు. 1962లో ఉంగుటూరు నియోజకవర్గం ఏర్పడి జరిగిన తొలి ఎన్నికల్లో నిడమర్రు మండలం చిననిండ్రకొలను పత్తేపురానికి చెందిన గాంధేయవాది, సర్వోదయ నాయకుడు, కీర్తిశేషులు చింతలపాటి మూర్తిరాజు (కాంగ్రెస్), కీర్తిశేషులు మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ తండ్రి, మాజీ డిసిసిబి ఛైర్మన్ వట్టి వెంకట రంగ పార్థసారధి (స్వతంత్ర)పై ఎంఎల్ఎగా గెలిచారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 214 పోలింగ్ కేంద్రాల్లో 2,05,334 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,01,152, మహిళలు 1,04,177 ఉన్నారు.

టిడిపి 5, కాంగ్రెస్ 5, వైసిపి ఒకసారి అధికారంలోకి..

1983, 1985, 1994, 1999, 2014లో టిడిపి, 1967, 1972, 1989, 2004, 2009లో కాంగ్రెస్, 2019లో వైసిపి అధికారంలో ఉన్నాయి.

బలమైన సామాజిక తరగతికే అధికారం

ఈ నియోజకవర్గంలో బీసీలు అత్యధికంగా ఉన్నారు. ఎస్‌సి, ఎస్‌టి తరువాత స్థానాల్లో ఉన్నా ప్రధానంగా కాపు, కమ్మ, క్షత్రియ సామాజిక తరగతులదే పెత్తనం అన్నట్లుగా ఇంతవరకూ కొనసాగింది.

మాజీ మంత్రులు, ప్రముఖులకు అడ్డా ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గం నాయకులు రాజకీయంగా ఎన్నో ఉన్నత పదవులు అలంకరించారు. చింతలపాటి మూర్తిరాజు తొలినాళ్లలో మంత్రిగా పనిచేశారు. వట్టి వసంతకుమార్ సాంస్కృతిక శాఖా మంత్రి పదవి చేపట్టారు. కాంగ్రెస్ నేత సుంకవల్లి ప్రసాదరావు భీమడోలు షుగర్స్ ఫ్యాక్టరీ ఛైర్మన్‌గా చాలా కాలం పనిచేశారు. ప్రముఖ క్రికెటర్, ప్రఖ్యాత క్రికెట్ ప్లేయర్ సచిన్ టెండూల్కర్‌కు అత్యంత సన్నిహితునిగా పేరుగాంచిన వంకిన ఛాముండేశ్వరినాథ్ ఈ నియోజకవర్గం వారే. క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో మహాత్మాగాంధీ రైలు ప్రయాణం చేస్తూ ఉంగుటూరు మండలం చేబ్రోలులో కొద్దిసేపు ఆగిన చరిత్ర ఈ నియోజకవర్గానిదే. అలాగే దేశం అంతా భూదానోద్యమం జరిగిన రోజుల్లో అఖిల భారత సర్వోదయ 13వ సమ్మేళనం ఉంగుటూరు మండలం నాచుగుంటలో 1965 ఏప్రిల్ 14, 15, 16 తేదీల్లో మూడు రోజులపాటు ఆనాటి కాంగ్రెస్ నాయకుడు, సర్వోదయ నేత చింతలపాటి మూర్తిరాజు ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో పేరొందేలా సాగాయి. ప్రపంచ సుందరిగా 2008లో ఎంపికైన సుంకవల్లి వాసుకి ఉంగుటూరువారే కావడం గమనార్హం. భారత సముద్ర తీరాల గస్తీలో భాగమైన కోస్ట్‌గార్డ్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్, ప్రెసిడెన్సీ మెడల్ అవార్డు గ్రహీత (ప్రస్తుతం రిటైర్ అయ్యారు) జిబి.మూర్తి ఉంగుటూరు వ్యక్తి కావడం గర్వకారణంగా చెబుతారు.

ఆక్వాసాగులో ప్రాముఖ్యత..

ఉంగుటూరు, భీమడోలు మండలాలు సగం డెల్టా, మెట్ట ప్రాంతాల కలయికతో భిన్న సంస్కృతి నెలకొంది. గణపవరం, నిడమర్రు మండలాల్లో పూర్తిగా ఆక్వా సాగే ఆధారం. ఉంగుటూరు నియోజకవర్గంలో దాదాపు 25 వేల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. 1999కు ఆక్వాలేని రోజుల్లో వరి పంటే ప్రధాన వృత్తితో ప్రజల ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రంగా ఉండగా ఆక్వా సాగుతో ఆర్థిక పరిస్థితి మారిపోయింది.



డెల్టాలో తాగునీటికి ఇబ్బందే..

గణపవరం, నిడమర్రు మండలాల్లో ఆక్వా ఆధారిత పరిశ్రమలు, వ్యర్థాల కారణంగా భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. అక్కడి వారు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు, నారాయణపురంలో సుమారు రూ.8 కోట్లతో రక్షిత తాగునీటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నా నిర్వహణా వైఫల్యం కారణంగా శివారు గ్రామాలకు నేటికీ శుద్ధినీరు అందడం కష్టంగా మారింది. సంపన్నులు తాగునీటిని కొనుక్కుంటుంటే పేదలు గత్యంతరం లేక కలుషిత జలాలను తాగి వ్యాధుల బారిన పడుతున్నారు.

ఉపాధి కోసం దేశ, విదేశాలకు యువత..

పాలకులు యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించడంలో విఫలమైన కారణంగా దేశ, విదేశాలకు వెళ్లిపోతున్నారు. పేదలకు ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నా ప్రభుత్వం ఇచ్చే సాయానికి బహిరంగ మార్కెట్ ఇంటి నిర్మాణ సరుకు ధరలకు అసలు పోలిక ఉండకపోవడంతో సొంతింటి కల అందరికీ సాకారం కాలేదు.

సమస్యలు పట్టించుకోని పాలకులు..

ఏలూరు కాలువపై నారాయణపురం వద్ద వంతెన ఈ నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యత ఉన్న బ్రిడ్జి. ఆక్వా ఉత్పత్తులు భీమవరం నుంచి జాతీయ రహదారి మీదుగా రవాణాకు చాలా అనువైన మార్గం ఇది. శిథిలావస్థకు చేరిన వంతెన ఎప్పుడు కూలుతుందో తెలీదు. ఎంతమంది పాలకులు వచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదు.

ఉంగుటూరులో గెలిచిన పార్టీయే అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్

ఉంగుటూరులో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ ఉంది. ఈ క్రమంలో ఇంత వరకూ అది నిజమవుతూ వస్తుండగా ఈ సారి ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నుంచి పత్సమట్ల ధర్మరాజు, సిట్టింగ్ ఎంఎల్ఎ, వైసిపి అభ్యర్థి పుప్పాల వాసుబాబు తలపడనున్నారు. దీనిపై నియోజకవర్గంలో ఇరు పార్టీ నాయకులు తమ తమ అంచనాలు వేసుకుంటూ బెట్టింగులు సైతం కాస్తున్నారు.

పెరిగిన ఓటర్లు.. మహిళల ఓట్లే ఎక్కువ

ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రతిసారీ ఎన్నికలకు ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఉంగుటూరు మండలంలో 63,645, భీమడోలులో 52,518, నిడమర్రు 37,276, గణపవరం 51,895 మంది ఓటర్లతో మొత్తం నియోజకవర్గంలో 20,5334 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. వీరిలో పురుషులు 101152 కాగా మహిళా ఓటర్లు 104177 ఉన్నారు. నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 3025 మంది ఎక్కువగా ఉన్నారు. అంటే అతివల తీర్పు కీలకంగా మారనుంది.

ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గచరిత్ర..

1967లో కాంగ్రెస్ తరపున చింతలపాటి సూర్యచంద్ర వరప్రసాద మూర్తిరాజు (ఇండియన్ కాంగ్రెస్), కీర్తిశేషులు మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ తండ్రి వట్టి రంగ పార్థసారధి (ఇం డిపెండెంట్)పై 4006 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా మళ్లీ మూర్తిరాజే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థి మాగంటి భూపతిరావుపై కడియాల సత్యనారాయణ (ఇండియన్ కాంగ్రెస్)16375 ఓట్లతో విజయం సాధించారు. 1983లో కాంగ్రెస్ అభ్యర్థి చింతలపాటి మూర్తిరాజుపై టిడిపి అభ్యర్థి కంఠమనేని శ్రీనివాసరావు 25,180 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 1985 ఉప ఎన్నికల్లో దశక లక్ష్మణశాస్త్రి (కాంగ్రెస్)పై టిడిపి అభ్యర్థి కంఠమనేని శ్రీనివాసరావు 29,519 మెజార్టీ సాధించారు. 1989లో టిడిపి అభ్యర్థి కంఠమనేని శ్రీనివాసరావుపై కాంగ్రెస్ అభ్యర్థి చావా రామకృష్ణ 20,104 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1994లో కాంగ్రెస్ అభ్యర్థి చావా రామకృష్ణపై టిడిపి తరపున కొండ్రెడ్డి విశ్వనాథం 18862 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 1999లో కొండ్రెడ్డి విశ్వనాథం (టిడిపి) గెలిచారు. 2004లో వట్టి వసంతకుమార్ (కాంగ్రెస్), టిడిపి అభ్యర్థిని ఇమ్మణ్ణి రాజేశ్వరిపై 15661 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 2009లో గన్ని లక్ష్మీకాంతం (టిడిపి)పై వట్టి వసంత్‌కుమార్ (కాంగ్రెస్) 6459 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2014లో గన్ని వీరాంజనేయులు (టిడిపి) పుప్పాల శ్రీనివాసరావు (వైసిపి)పై 8,930 ఓట్లతో గెలుపొందారు. 2019లో పుప్పాల శ్రీనివాసరావు (వైసిపి) గన్ని వీరాంజనేయులు (టిడిపి)పై 33,153 భారీ మెజార్టీ సాధించారు.

నరసాపురం పోరులో.. మాధవనాయుడు..!

సొంత పార్టీ నేతలతో పొసగకపోవడమే కారణం

చంద్రబాబు సమక్షంలోనూ తేలని పంచాయతీ

అనుచరుల ఒత్తిడితో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వైసిపి నుంచి నుంచి క్షత్రియ సామాజిక తరగతికి చెందిన ముదునూరి ప్రసాదరాజు, జనసేన నుంచి బొమ్మిడి నాయకర్ అభ్యర్థిత్వాలు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో 2019లో పోటీలో ఉన్న అభ్యర్థులే మళ్లీ తలపడే అవకాశం ఉందనుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో జనసేన నుండి బొమ్మిడి నాయకర్, టిడిపి నుండి బండారు మాధవనాయుడు, వైసిపి నుంచి ముదునూరి ప్రసాదరాజు పోటీలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో టిడిపి మూడోస్థానానికి పడిపోయింది. దీంతో మూడేళ్ల క్రితం ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మార్పు జరిగింది. దీంతో ఆ పార్టీలో గ్రూపు విభేదాలు భగ్గుమన్నాయి. డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ పొత్తూరి రామరాజుకు ఇన్‌ఛార్జి బాధ్యత అప్పగించారు. స్థానిక ఎన్ఆర్ఐ కొవ్వలి రామ్మోహన్‌నాయుడు సాయంతో ఆయన పార్టీని నడిపిస్తున్నారు. ఇటీవల బండారు మాధవనాయుడు విజయవాడ నుంచి మొగల్తూరు వచ్చినప్పుడు ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ గుడి వద్ద విలేకరులతో మాట్లాడుతూ తన భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని తెలిపారు. ఆ తర్వాత మాధవనాయుడు గ్రూపు, రామరాజు గ్రూపుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఆ తర్వాత బండారు మాధవనాయుడును నారా లోకేష్ పిలిపించి మాట్లాడారు. జనసేన అభ్యర్థికి మద్దతివ్వాలని, మంచి భవిష్యత్తు ఉంటుందని లోకేష్ మాధవనాయుడుకు హామీ ఇచ్చారు. ఇటీవల మాజీ మంత్రి సమక్షంలో పంచాయతీ పెట్టినా మాధవనాయుడు, రామరాజు నడుమ విభేదాలు పరిష్కారం కాలేదు. ఈ నెల 5వ తేదీన నరసాపురం ప్రజాగళం సభకు విచ్చేసిన చంద్రబాబుకు హెలీప్యాడ్ వద్ద మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన రోడ్డుషో, బహిరంగ సభల్లో ఎక్కడా మాధవనాయుడు కనిపించలేదు. దీంతో ఆరా తీసిన చంద్రబాబు ఇటీవల పాలకొల్లులోని ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన టిడిపి నరసాపురం నియోజకవర్గ నాయకులతో ఈ వివాదంపైనా చర్చించారు. చంద్రబాబు చెప్పినా కలుపుకోవడానికి ఓ నాయకుడు ఒప్పుకోలేదని సమాచారం. దీంతో నియోజకవర్గంలో టిడిపి మూడు గ్రూపులుగా చీలిపోయింది. ఈ నేపథ్యంలో మాధవనాయుడిని పోటీలో ఉండాలని ఆయన అనుచరులు ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. మనస్సులు కలవని చోట అధినేత చెప్పారని వెళ్లి అవమాన పడేకన్నా ఒంటరిగా పోటీ చేసి బలం నిరూపించుకోవడం ద్వారా భవిష్యత్తు ఉంటుందని నేతలు చెబుతున్నట్లు సమాచారం. ఇప్పుడున్న అభ్యర్థులు నాన్ లోకల్ కావడం, ఈసారి ప్రధాన పార్టీలు కాపు సామాజిక తరగతికి టిక్కెట్ ఇవ్వకపోవడం మాధవ నాయుడుకు కలిసొచ్చే అంశాలుగా విశ్లేషిస్తున్నారు. ఏదేమైనా జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌కు తెలుగు తమ్ముళ్ల వివాదం తలనొప్పిగా మారింది. ఈ వివాదం ఇలాగే కొనసాగితే అధికారి పార్టీకి మేలు చేకూరుతుందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పిలిస్తే పలికే వ్యక్తిగా ఉంటా

ఉండి స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి నియోజకవర్గంలో ఎవరికైనా ఆపద వస్తే పిలిస్తే పలికే వ్యక్తిగా ఉంటానని మాజీ ఎంఎల్ఎ, ఉండి స్వతంత్ర అభ్యర్థి వేటూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) అన్నారు. కోరుకొల్లు, మైప, మోగల్లు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా ఆటోలో తిరుగుతూ తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ శివరామరాజు ఓట్లు అభ్యర్థించి మాట్లాడారు. 20 ఏళ్లుగా ఒకే పార్టీలో ఉన్నానని, పదేళ్లపాటు ఎంఎల్ఎగా పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. తాను నమ్ముకున్న టిడిపి మోసం చేసిందని ఈ నేపథ్యంలో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచి మీ ముందుకు వస్తున్నానని, తన గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబరాజు, నాయకులు పెనుమత్స శివరామరాజు పాల్గొన్నారు.



వికలాంగురాలిని ఓటు అభ్యర్థిస్తున్న శివరామరాజు

సంక్షేమ పథకాల ఘనత వైసిపిదే

ప్రజాశక్తి - మొగల్తూరు

కులమత రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కెపిపాలెంనార్త్‌లో ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ ప్రచారంలో సర్పంచి కడలి సోంబాబు, ఎంపిటిసి సభ్యులు డివివి సత్యనారాయణ, లింగం ఏసుబాబు, జెడ్‌పిటిసిలు తిరుమాని బాపూజీ, బొక్కా రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ముదునూరి ప్రసాదరాజు

బిజెపికి బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి - నరసాపురం

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయని బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయ భాస్కరకృష్ణ ప్రసాద్ (బుజ్జి) అన్నారు. మంగళవారం బుజ్జి తన స్వగృహంలో నాయకులతో కలిసి కాంగ్రెస్ గ్యారంటీ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం 9వ వార్డు నందమూరి కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లిపూడి శ్రీను, సాధనాల చిన్న, సోడదాసి శ్రీధర్ పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతో మేలు'

ప్రజాశక్తి - పోడూరు

రాష్ట్రంలో రాబోయే టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతుందని నిమ్మల సూర్యకుమారి అన్నారు. ఆమె మట్టపర్రు గ్రామంలో మంగళవారం టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు ను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే రామానాయుడు సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఎన్నికల సమయంలో చెప్పే వైసిపి అభ్యర్థి మాటలు నమ్మొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, వెంకటరావు, పెన్మత్స రాంబద్రరాజు, దాసరి రత్నరాజు, పాలవలస తులసీరావు, మేడిశెట్టి బుజ్జి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గణపవరం : ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న పచ్చమట్ల ధర్మరాజును గెలిపించాలని కోరుతూ మంగళవారం ధర్మరాజు సోదరులు పత్సమట్ల భీమరాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. భీమరాజు వెంట టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు ఉన్నారు.


మాట్లాడుతున్న మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

అంబేద్కర్ ఆశయాలతో ప్రభుత్వాలు పనిచేయాలి

ప్రజాశక్తి - ఆచంట

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. మంగళవారం ఆచంట వేమవరంలో మాల మహానాడు కార్యాలయం వద్ద పెనుమంట్ర మండల యువజన విభాగం అధ్యక్షులుగా గెడ్డం జాన్సన్, నెలమూరు గ్రామ గౌరవాధ్యక్షులుగా యడ్ల.గంగరాజు, నెలమూరు గ్రామ అధ్యక్షులుగా నేలపూడి సురేష్, ఉపాధ్యక్షులుగా ఎడ్ల జూబ్లీ రాజు, ప్రధాన కార్యదర్శిగా సాకా ఏసు, కార్యదర్శిగా పాలపర్తి వెంకట నరసయ్య, సహాయ కార్యదర్శిగా వీసా కోటి లాజరును నూతనంగా నియమించి నియామక పత్రాలను పుష్పరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దళిత కాలనీల అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలోనే ఉన్నాయని వాపోయారు. దళితకాలనీలు అభివృద్ధి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని, వీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రానున్న రోజుల్లో ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్ నిధులు పూర్తిశాతం ఖర్చు చేసి అభివృద్ధి బాటలో నడిపించాలని పుష్పరాజ్ డిమాండ్ చేశారు.

మహిళలకు చీరలు, హ్యాండ్ బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

మనతో పాటు మన చుట్టూ ఉన్నవారు కూడా సంతోషంగా ఉన్నప్పుడే నిజమైన పండుగ అని, తెలుగువారు ఎక్కడ ఉన్నా మన సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించాలని ఎస్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జనార్దన్‌రావు అన్నారు. మోడీ గ్రామంలో క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు (రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం) జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ ఆర్థిక సాయంతో మహిళలకు ఎస్‌టియు చిహ్నం ఉన్న హ్యాండ్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ మోహన్ బాబు, పాలకోడేరు మండల అధ్యక్షులు సుబ్బరాజు, మండల అధ్యక్షులు సురేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు .

‘టీ టైమ్ విత్ నాయకర్’

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణం (సెంటర్) మెయిన్ రోడ్డు నందు గల మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ‘టీ టైమ్ విత్ నాయకర్” కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గ జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొని వ్యాపారులకు టీ అందించారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఘంటా కృష్ణ, పోలిశెట్టి సాంబ, పొన్నాల నాగబాబు పాల్గొన్నారు.

సొంత గూటికి సర్పంచి

ప్రజాశక్తి - నరసాపురం

జనసేనలో గెలిచి, వైసిపిలో చేరిన సర్పంచి తిరుమాని వెంకటరాజు తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. మంగళవారం ఆయన బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి నాయకర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉగాది పురస్కారాలతో సత్కారం అభినందనీయం

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

దేవస్థానాల్లో అంకితభావంతో పనిచేస్తున్న పండితులు అర్చకులను ఉగాది పురస్కారాలతో సన్మానించడం అభినందియమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం శ్రీ క్రోధి నామ నూతన సంవత్సరం ఉగాది వేడుకలను జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు,వేద పండితులు, అర్చకులకు ఉగాది పురస్కారాలు అందజేసే జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అంకిత భావంతో దేవస్థానాలలో సేవలందిస్తున్న వీరిని ఉగాది పురస్కారాలతో సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.శ్రీ క్రోధి నామ నూతన సంవత్సరంలో జిల్లాలో ప్రజలకు అన్ని విధాలా మేలు జరగాలని, అన్ని కుటుంబాలు ఆయురారోగ్య, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాక్షించారు. పాడి పంటలతో రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. తెలుగు సంప్రదాయాలను, తెలుగు మూలాలను మర్చిపోకుండా వేడుకలను నిర్వహించు కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ, ధర్మాధాయ శాఖ అధికారి ఇ.వెంకట సుబ్బారావు, జిల్లా సహాయ కమీషనరు మరియు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్, వేద పండితులు, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలు అందిస్తున్న కలెక్టర్ సమిత్ కుమార్

తాగునీటి చెరువులకు నీళ్లు వదలాలి

కలవపూడి సర్పంచి గేదెల జాన్

ప్రజాశక్తి - కాళ్ల

తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు 20 రోజుల పాటు వంతుల వారీ విధానంలో నీటిని అందించాలని కలవపూడి గ్రామ సర్పంచి గేదెల జాన్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. కలవపూడి తాగునీటి చెరువు, అన్నయ్య కోడు, వెంకయ్య వయ్యేరు పంట కాలువలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నయ్యకోడు ఛానల్ నుంచి నాలుగు నెలలుగా పూర్తిస్థాయిలో నీరు రావడం లేదన్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కలిసి తాగునీటి సమస్యను వివరించామన్నారు. గోదావరిలో నీరు లేదు, సీలేరు జలాల నుంచి అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఇంతవరకూ వంతుల వారీగా నీటిని విడుదల చేయలేదన్నారు. వెంకయ్య వయ్యేరు పంట కాలువలో గుర్రపుడెక్క, తూడు మేట వేయడంతో పాటు మట్టి పేరుకుపోయిందన్నారు. 10 గ్రామాల ప్రజలకు తాగునీరందించే అన్నయ్య కోడు ఛానల్ మురుగు కాలువగా తయారైందన్నారు. ఇటీవల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తాగునీటి చెరువులు, అన్నయ్య కోడు పంట కాలువల్లో నీటిని పరీక్షించి ఉప్పునీటి శాతం ఎంత ఉందో పరిశీలించాలన్నారు. అన్నయ్య కోడు పంట కాలువకు 20 రోజులపాటు వంతుల వారీ విధానంలో నీటిని అందించాలన్నారు.

చెరువును పరిశీలిస్తున్న కలవపూడి గ్రామ సర్పంచి గేదెల జాన్

11 మంది వాలంటీర్లు తొలగింపు

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లఘించిన 11 మంది వాలంటీర్లను తొలగించినట్లు నరసాపురం ఎంపిడిఒ ఎంవి రమణారావు తెలిపారు. మండలంలోని కొప్పర్రు గ్రామ పంచాయతీకి చెందిన వేగి అనిల్ కుమార్, గోరింకల రేవంత్, దేవిరెడ్డి సూర్య మణికంఠ, పాకా ఎస్తేరు రాణి, చినమిల్లి వెంకట చంద్రకాంతమ్మ, పాలపర్తి సంధ్య, బద్ధ శిరీష, చేరుగొండి రవీనా, ఉన్నమట్ల శైలు, బద్దా కపా జ్యోతి, కోమటి నాగ దుర్గ 11 మంది వాలంటీర్లు ఎన్నికల నియమావళి ఉల్లఘించి, రాజకీయ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గ్రామస్థాయి ఎంసిసి కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా విచారణ చేపట్టి 11 మంది వాలంటీర్లు తొలగించినట్లు ఎంపీడీవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు, జుత్తిగ, నత్తారామేశ్వరం, మల్లిపూడి, నెగ్గిపూడి, పొలమూరు తదితర గ్రామాల్లో పలు దేవాలయాల్లో మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు జరిగాయి.

కాళ : క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. కాళ్లకూరు వెంకటేశ్వరస్వామిని ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు, ఆయన సతీమణి అరుణ, టిటిడి మాజీ సభ్యులు గోకరాజు రామరాజు దర్శించుకున్నారు.

ఘనంగా గోగులమ్మ జాతర

ప్రజాశక్తి - ఆచంట

ఉగాదిని పురస్కరించుకొని భీమలాపురంలో ప్రసిద్ధి గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో అమ్మవారి గరగలను గ్రామ పురవీధుల గుండా పెద్ద ఎత్తున బాణసంచా, వాయిద్యాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు అమ్మవారికి పాన్పులు నిర్వహించే మొక్కులు చెల్లించుకున్నారు.

కట్.. కట్..!

(మొదటి పేజీ నుంచి)

కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తక్కువగా లెక్కించినా రూ.20 వేల వరకూ అప్పు చేయాల్సి రావడంతో జనం ఆర్థికంగా నలిగిపోతున్నారు. ఎండవేడిమి తాళలేక సామాన్య ప్రజానీకం సైతం కూలర్లు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. జిల్లాలోని పలు మండలాల్లో రెండు గంటలకోసారి అరగంట చొప్పున కరెంటు కోత విధిస్తున్నట్లు జనం చెబుతున్నారు. గతంలో కరెంటు కోతలు ఎక్కువగా ఉంటే గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పెద్దలు విద్యుత్ అధికారులను నిలదీసేవారు. ఇప్పుడు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, పెద్దలంతా ఇన్వర్టర్లు, ఎసిలు వాడుతుండటంతో ప్రజల బాధలను ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. దీంతో విద్యుత్ అధికారుల కరెంటు కోతలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. వ్యవసాయానికి సైతం రోజుకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తామని చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు. వ్యవసాయానికి రోజుకు ఏడు గంటలకు మించి కరెంటు సరఫరా జరగడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ముమ్మందు పరిస్థితిపై ఆందోళన

వేసవి ఆరంభంలోనే కరెంటు కోతలు ఈ విధంగా ఉంటే మే నెలలో పరిస్థితి ఏమిటనే ఆందోళన జనాన్ని వెంటాడుతోంది. ముమ్మందు ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఇటువంటి తరుణంలో విద్యుత్ కోతలు పెరిగితే జనం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రానుంది. విద్యుత్ కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

సిట్టింగులకే సీటు అని.. ఇప్పుడు మోసగిస్తారా

(మొదటి పేజీ నుంచి)

పరిస్థితుల దృష్ట్యా టిక్కెట్ త్యాగం చేయాల్సి ఉంటుందని చెప్పారన్నారు. నియోజకవర్గ పార్టీ శ్రేణులతో మాట్లాడి చెబుతానన్నానని, పార్టీలో ఉండాలా, రాజకీయాల నుంచే తప్పుకోవాలా అనేది మీరు చెప్పేదాన్ని బట్టి కుటుంబంతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. పలు మండలాల నేతలు మాట్లాడుతూ రామరాజు నిర్ణయాన్ని బట్టి నడుచుకుంటామన్నారు. కార్యకర్తల మనోభావాలను గౌరవించాలని, రామరాజుకు టికెట్ కొనసాగించాలని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కష్ట కాలంలో వెన్నంటే ఉండి, అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా రామరాజు పని చేశారని, ఆయనను ఎందుకు అధిష్టానం ఇబ్బంది పెడుతుందోనని వ్యాఖ్యానించారు. ఎటువంటి మార్పూ లేకుండా రామరాజుకే టిక్కెట్ కొనసాగించాలని, 50 వేల మెజార్టీతో రామరాజును గెలిపించుకుంటామని ప్రకటించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. మాకు అందుబాటులో ఉండే వ్యక్తి కావాలని స్పష్టం చేశారు. రామరాజు సోదరుడు నర్సింహరాజు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన రామరాజుకే టిక్కెట్ ఇవ్వాలని, దీనిపై సందిగ్ధత బాధాకరమని కన్నీటిపర్యంతమయ్యారు. దీనిపై పరిశీలకునిగా విచ్చేసిన టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన, బిజెపితో పొత్తు వల్ల కొన్ని స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చిందన్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఉండి టిక్కెట్ మార్పు విషయంలో సహకరించాలని రామరాజును చంద్రబాబు కోరారన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తల అభిప్రాయాలను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. రెండు రోజుల్లో ఉండి టిక్కెట్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు.

జ్యూట్‌మిల్లు తెరవాలి : సిపిఎం

(మొదటి పేజీ నుంచి)

కనీసంగా స్పందించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఓట్లు, సీట్లు, అధికారం కోసం మాత్రమే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే పార్టీలు ఏలూరులో వేలాది మందికి ఉపాధిని కల్పించే పరిశ్రమలు మూసివేతకు గురైతే యాజమాన్యంతో మాట్లాడి అటు కేంద్రం నుండి, ఇటు రాష్ట్రం నుండి తగు సహకారం అందించి మిల్లులు తెరిపించడం, కార్మికుల ఉపాధిని కాపాడటం వంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని తెలిపారు. జ్యూట్‌మిల్లుల మూసివేతపై అధికార, ప్రతిపక్ష పార్టీలు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు తమ హక్కుల కోసం చేసే పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

కొత్తూరు జ్యూట్‌మిల్లును మూసివేయడం కార్మికులకు తీవ్ర అన్యాయం చేయడమేనని ఎఐటియుసి ఏలూరు జిల్లా సమితి అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో యాజమాన్య చర్యను తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తక్షణమే జోక్యం చేసుకుని మిల్లును తెరిపించాలని విజ్ఞప్తి చేశారు.

రూ.12.45 కోట్లు విలువైన నగదు, వస్తువులు సీజ్

(మొదటి పేజీ నుంచి)

ఫిర్యాదులు అందగా వాటిలో 186 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. మరో 101 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించామని, ఎన్నికల ఉల్లంఘనలపై మీడియాలో వచ్చిన 85 ఫిర్యాదులు పరిష్కరించామని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. జిల్లాలో 24 వీడియో సర్వ్ లైన్స్ టీములు పని చేస్తున్నాయని తెలిపారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి ఇప్పటి వరకూ 43 మంది సిబ్బందిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ప్రజలు నగదుగాని, ఇతర విలువైన వస్తువులుగాని ప్రయాణ సమయంలో తీసుకెళ్లేటప్పుడు అందుకు సంబంధించి సరైన ఆధార పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తెలుగు సంవత్సరాది క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని నరసాపురం గ్రామానికి చెందిన వేద పండితులు కె.అచ్యుతరామారావు అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణమరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, చండీ హోమాలు నిర్వహించారు. ప్రజలకు ఉగాది పచ్చడి అందజేశారు. అనంతరం యాత్రికుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి యాత్రికులకు అందించారు. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో పాలకవర్గ సభ్యులు ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు

మొగల్తూరు: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు వైసిపిలో స్వచ్ఛందంగా చేరుతున్నారని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాద్ రాజు అన్నారు. మంగళవారం మండలంలోని కెపి పాలెం నార్త్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పలువురు పార్టీలో చేరారు. వారికి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాద్ రాజు పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. నరసాపురం నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి సోంబాబు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

పుంతలో ముసలమ్మ సన్నిధిలో ఎంఎల్‌సి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని శ్రీరామ పేటలోని పుంతలో ముసలమ్మ అమ్మవారిని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ ఉగాది సందర్భంగా దర్శించుకున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు. ఆయనతో పాటు నాయకులు గుణ్ణం నాగబాబు, మోర్త గిరీష్, నిరంజన్, గేదెల నరసింహారావు, పెంటపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఉగాది ఉత్సవాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యన్నగూడెం రామ కోనేరు సమీపంలో ముత్యాలమ్మకు జలాభిషేకం నిర్వహించారు. ఉగాది పండుగ పురస్కరించుకుని ప్రతి ఏడాది నిర్వహించే ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న హరిసుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో స్వస్తి చాంద్రమాన క్రోధి నామ సంవత్సరం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ద్వారకాతిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకాతిరుమలలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఉగాది ఉత్సవం మంగళవారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు.

వినోద్ ఇంటింటా ప్రచారం

ముదినేపల్లి: మండలంలోని కొరగంటిపాలెం గ్రామంలో మంగళవారం టిడిపి నాయకులు కొడాలి వినోద్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ గ్రామంలో ఇంటి ఇంటికీ తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ అధికారం వచ్చిన తక్షణమే టిడిపి తరుపున మీ సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల రవి పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో అందరూ ఆనందంగా ఉండాలి

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప, పట్టణంలోని పలు వార్డుల నుంచి టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి కుటుంబం కూడా ఆనందంగా, సంతోషంగా ఉండేందుకు నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. ముఖ్యంగా భీమవరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానని వెల్లడించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆకర్షితులై వైసిపిలో చేరుతున్నారని, వారందరికీ తాను అండగా ఉంటానని అన్నారు. భీమవరం


వైసిపిలోకి ఆహ్వానిస్తున్న గ్రంధి

నియోజకవర్గంలో ల్యాండ్ మార్క్‌గా అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందని అన్నారు. పార్టీలో చేరిన వారిలో చెన్ను కిషోర్, కందుల రాము, కొప్పర్తి సురేష్, కొప్పర్తి నాయుడు, ఎస్‌కె.షామీర్ తదితరులున్నారు. వేరు వేరుగా జరిగిన ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య పాల్గొన్నారు.

'ఓటు అడిగే హక్కు చంద్రబాబు నాయుడుకి లేదు'

ప్రజాశక్తి - గణపవరం

ఓటు అడిగే హక్కు చంద్రబాబు నాయుడుకు లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిపల్లి మంగరాజు అన్నారు. మంగళవారం గణపవరంలో ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న సమయంలో జన్మభూమి కమిటీల ద్వారా ప్రజల సొమ్ములు దోచుకుని ప్రజలను మోసం చేశారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి 2019లో ఇచ్చిన హామీలు నూటికి నూరు శాతం అమలయ్యాయన్నారు. వాలంటీర్ వ్యవస్థ గురించి అసభ్యంగా మాట్లాడి దేశద్రోహులుగా అభి వర్ణించిన పవన్ కళ్యాణ్ మరలా ఈరోజు వాలంటీర్ వ్యవస్థ రద్దు చేయము అని, వారికి రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాటలు మార్చే ఇద్దరినీ ప్రజలు నమ్మరని తెలిపారు. ఎన్నికల తర్వాత టిడిపి, జనసేన కూటమి తెరమరుగు అవుతుందని మంగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు టి.శివ, పి.రామారావు, బి.సందీప్, బి.సునీల్ బాబు పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయ పంచాంగం ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను సమన్వయం చేసుకుంటూ, సమాచారం ఉద్యాన రైతులకు చేరేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి అన్నారు. ఉద్యాన రైతుల ప్రయోజనార్థం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పంచాంగాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం విజయవాడలోని వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రతీ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం సాంప్రదాయమని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో ఆవిష్కరించినట్లు ఉప కులపతి టి.జానికిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ మరిన్ని మంచి

పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న జవహర్‌రెడ్డి

ప్రచురణలు విశ్వవిద్యాలయం తీసుకురావాలని సూచించారు. అనంతరం విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జానకీరామ్‌ను, శాస్త్రవేత్తలను చీఫ్ సెక్రటరీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రర్ డాక్టర్ శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ పాల్గొన్నారు.

తెలుగు భాష విశిష్టమైంది

డాక్టర్ రంకిరెడ్డి రామమోహనరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రపంచంలోని భాషల్లో తెలుగు భాష విశిష్టమైనదని, తెలుగు వారిగా మనం గర్వించాలని పెనుగొండ డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ రంకిరెడ్డి రామమోహనరావు అన్నారు. మంగళవారం మార్టేరు రోటరీ భవనంలో స్థానిక శివుడు కళా సేవా స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో అయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యువ కవుల కవి సమ్మేళనం నిర్వహించారు. పండితులు జోష్యుల వెంకట్రామ్ ఉగాది పంచాంగ పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు చిర్ల సూర్యనారాయణ రెడ్డి, రాజేంద్రప్రసాద్ రెడ్డి, ఎల్‌విఎస్.మూర్తి, సుధీర్ కుమార్, శివరాం రెడ్డి, సేవా స్రవంతి కన్వీనర్ వెంకటరామయ్య, శివ నాగేశ్వర్ పాల్గొన్నారు.



రంకిరెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

సిద్దాపురం రోడ్డు రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - ఆకివీడు

మండల కేంద్రంలోని ఆకివీడు పట్టణం నుంచి సిద్దాపురం వైపు వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న రైల్వే గేట్‌ను మంగళవారం ఉదయం మూసివేశారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఆర్ అండ్ బి, ఇతర అధికారులకు ముందస్తుగా సమాచారం అందించిన అనంతరం మూసివేసామని స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ ఎస్ఎస్.మాణిక్యం తెలిపారు. మరమ్మతులకు ఈనెల 12వ తేదీ రాత్రి వరకు సాంకేతిక అధికారులు సమయాన్ని నిర్ణయించారని చెప్పారు. అయితే పనులు ఈలోగా పూర్తయితే వెంటనే గేటు తెరిచివేస్తామన్నారు. గేటు ఇరువైపులా రహదారుల భవనాల శాఖ సిమెంట్ రోడ్డు కొత్తగా నిర్మించారు. అయితే ఆ రోడ్డులో ప్రయాణికులకు, వాహనాలకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. ఆ రోడ్లో ఉన్న అడ్డంకులు తొలగించి అనుమతి ఇచ్చిన అనంతరం దుంపగడప వెళ్లే రోడ్డు వద్ద ఉన్న రైల్వే గేట్‌ను మూసి మరమ్మతులు చేపడతామని ఎస్ఎస్.మాణిక్యం తెలిపారు.

మూసివేసిన రైల్వే రూటు

మద్యం దుకాణాలు తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

మద్యం దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - ఉండి

అక్రమ మద్యం కలిగి ఉంటే చర్యలు తప్పవని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు మండ రామకృష్ణారెడ్డి అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య ఆదేశాల మేరకు మండలంలోని పలు మద్యం దుకాణాలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల అధికారి ఆదేశాలను తూచా తప్పకుండా నేటి నుంచి మద్యం దుకాణాలను తరచూ తనిఖీ చేస్తామని, ఎప్పుడైనా అక్రమ మద్యం కలిగి ఉన్న ఒక వ్యక్తికి మూడు బాటిల్స్ కన్నా ఎక్కువ బాటిల్లు అమ్మితే ఎక్సైజ్ చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో కేశిరెడ్డి గోపాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిలో దొంగ చేరికలు

ప్రజాశక్తి - వీరవాసరం

భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రాపకంతో తోలేరు పంచాయతీ పరిధిలోని పడమటిపాలెం గ్రామం వైసిపికి చెందిన కొంత మందిని టిడిపి వారంటూ ప్రచారం చేస్తూ.. మరలా వారు వైసిపిలో చేరుతున్నట్టు వైసిపి నాయకులు చవాకుల సత్యనారాయణ, కోడి శ్రీనివాస్‌లు తమ నాయకుడి వద్ద నాటకమాడుతున్నారంటూ ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి, టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్‌లు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ రకంగా గ్రంధి శ్రీనివాస్ ప్రాపకం కోసం వారు పడుతున్న ఈ దొంగ చేరికల పట్ల తీవ్ర విమర్శలు చేశారు. ఏనాటి నుంచో వైసిపిలో ఉన్న వారిని మరలా అదే పార్టీలో తాము చేర్పిస్తున్నారంటూ విమర్శించారు. క్షేత్రస్థాయిలో గ్రంధి శ్రీనివాస్ మీ పార్టీలో చేరినవారు ఏ పార్టీకి చెందినవారో పరిశీలించుకోవాలన్నారు. పడమటిపాలెంలో టిడిపి, జనసేన నుంచి ఎవరూ వైసిపిలో చేరలేదని స్పష్టం చేశారు.

జనసేనలోకి పలువురు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని జల్లి కాకినాడ గ్రామ వైసిపి నాయకులు మల్లంపల్లి అశోక్, డొల్ల ప్రకాశం, ఓటికాల సరిన్, జాలే కుమార్‌తో పాటు మరికొద్దిమంది వైసిపికి రాజీనామా చేసి మంగళవారం పచ్చమట్ల ధర్మరాజు సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ జనసేనలో చేరికలతో వైసిపి పతనం ప్రారంభమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉగాది సందర్భంగా పాలకొల్లు పట్టణం బొమ్మల సెంటర్‌లో ఉన్న భక్తాంజనేయ వెంకటేశ్వ ర స్వామి ఆలయంలో బొడ్డు సూర్యారావు, వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి అన్నసంతర్పణ ఏర్పా టు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలకొల్లు వైసిపి అభ్యర్థి గుడాల శ్రీహరి, గోపాలరావు విచ్చేసి అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ పాల్గొన్నారు.


అన్నదానంలో భక్తులు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీన్

ఎపి నిట్‌లో క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్నేహపూర్వక క్రికెట్ పోటీలు ఆచార్యులు, విద్యార్థుల మధ్య వారధిగా నిలుస్తాయని ఎపి నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్ కుమార్ తెలిపారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సహకారంతో వారం రోజులపాటు నిర్వహించనున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ (సిపిఎల్-12 ఓటర్లు) టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ క్రికెట్ లీగ్ పోటీలో విద్యార్థులతోపాటు బోధన, బోధనేతర సిబ్బందితోకూడిన మొత్తం ఎనిమిది జట్లు తలపడనున్నాయని తెలిపారు. రోజుకు రెండు, మూడు మ్యాచ్‌ల చొప్పున నిర్వహిస్తామని, ఆటల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కిరణ్ తీపర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో మేథోశక్తిని పెంపొందించేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులను నాణ్యమైన క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించనున్నామని వివరించారు. ముందుగా వీరేష్, కిరణ్ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారి పేర్లు అడిగి కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో జోష్ నింపారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్ డాక్టర్ సుదర్శన్ ధ్రువ, సాస్ అసిస్టెంట్లు డాక్టర్ వి.శ్రీనివాస్, సాయిరామ్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న కృష్ణారెడ్డి

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక ఎన్‌ఆర్‌పేటలో ఓవర్ బ్రిడ్జి పక్కన న్యాయవాది, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి సౌజన్యంతో హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో 31వ రోజు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి ఎండలు విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇళ్ల నుంచి బయటికి వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ మంచినీళ్ళు, మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలన్నారు. తన మనవడు గుర్రాల అఖిల్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మారెడ్డి పద్మజావాణి, జూనియర్ న్యాయవాది వెంకటేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రూ.8.35 లక్షలు స్వాధీనం

పట్టుబడిన నగదుతో అధికారులు

ప్రజాశక్తి - కామవరపుకోట

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి ఎటువంటి ఆధారాలూ లేని రూ.2.15 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఇన్‌ఛార్జి కె.బాబూరావు తెలిపారు. రావికంపాడుకు చెందిన ఒక వ్యక్తి నుండి రూ.60 వేలు, పాత గండిగూడెం గ్రామానికి చెందిన ఒక మహిళ వద్ద రూ.లక్షా 55 వేలు స్వాధీనం చేసుకుని నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, ఎఎస్ఐ పివి.స్వామికి అందజేసినట్లు బాబూరావు తెలిపారు. తగిన ఆధారాలు చూపించి ఏలూరులోని ఎన్నికల ట్రెజరీ కార్యాలయం నుంచి ఈ నగదును వెనక్కి తీసుకోవచ్చని తెలిపారు. వాహనాల తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కె.రమేష్, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్: పట్టణంలో కొవ్వూరు రోడ్డులోని పాతబస్టాండ్ సెంటర్ వద్ద వాహనాల తనిఖీల్లో మంగళవారం ఉదయం రూ.లక్షా 20 వేలు స్వాధీనం చేసుకున్నారు. కొయ్యలగూడెం మండలం రామాంజనేయపురం గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వస్తుండగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి ఆధారాలు లేని రూ.లక్షా 20 వేలు నగదు స్వాధీనం చేసుకుని ట్రెజరీకి పంపారు.

ఏలూరు స్పోర్ట్స్: సరైన ఆధారాలు లేకుండా పరిమితికి మించి తరలిస్తున్న నగదును సీజ్ చేశామని పెదవేగి తహశీల్దార్ సూర్యప్రభ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్-3 అధికారి బి.నరసయ్య, పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తమ సిబ్బందితో కలిసి విజయరాయి సమీపంలో బలివే అడ్డరోడ్డు వద్ద మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో అనపర్తి నుంచి ధర్మాజీగూడెం మీదుగా ఏలూరువైపు ద్విచక్రవాహనంపై వస్తున్న చందురెడ్డి, శంకర్రావు అనే ఇద్దరు వ్యక్తుల దగ్గర ఎటువంటి ఆధారాలు లేని రూ.1,35,400ను నగదును గుర్తించి సీజ్ చేశామన్నారు. లింగపాలెం మండలానికి చెందిన పాస్టర్ ఏలియ్య కారులో తరలిస్తున్న రూ.1.50 లక్షలను గుర్తించి సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన సొమ్మును ఏలూరు జిల్లా ట్రెజరీలో జమచేశామని, సంబంధీకులు సరైన ఆధారాలు చూపిస్తే ఆ నగదును తిరిగి ఇచ్చేస్తామని ఆమె వివరించారు.

శ్రీరామరాజు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

33వ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు


మాట్లాడుతున్న బలరాం

గాదిరాజు శ్రీరామరాజు సాగించిన పోరాటాల స్ఫూర్తితో అంతా ముందుకు సాగాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. సిపిఎం భీమవరం తాలూకా నాయకునిగా, గొల్లలకోడేరు గ్రామ సర్పంచిగా, రైతుసంఘ నాయకునిగా శ్రీరామరాజు అందించిన సేవలు అద్వితీయమన్నారు. గొల్లలకోడేరు గ్రామంలో గాదిరాజు శ్రీరామరాజు 33వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. శ్రీరామరాజు విగ్రహానికి జిల్లా కార్యదర్శి బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, శ్రీరామరాజు కుమారులు సూర్యనారాయణరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సిపిఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో శ్రీరామరాజు ఎనలేని కృషి చేశారన్నారు. తుపాన్లు వచ్చి రైతులు నష్టపోయిన సందర్భంలో ఆయన సేవలు మరువలేనివన్నారు. నాడు భీమవరం తాలూకాలో సిపిఎం నాయకులుగా ప్రజలకు సేవ చేయడంలో పీడిత ప్రజల మదిలో గుర్తుండిపోయారన్నారు. జెఎన్‌వి.గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నాటి పాలకులు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోతే ఎంతటి వారినైనా నిలదీసి అడిగేవారన్నారు. నేటి పాలకులు ప్రజల సమస్యల కంటే కార్పొరేట్ల సంపద పెంచే పనుల్లో నిమగ్నమయ్యారని విమర్శించారు. శ్రీరామరాజు స్ఫూర్తితో నేటి పాలకులను నిలదీసి పోరాటాలు నిర్వహించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కేంద్రంలో మోడీ రైతులకు నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలపై ప్రాణాలు సైతం లెక్కచేయకుండా వీరోచిత పోరాటం చేసి వెనక్కి కొట్టిన ఘనత రైతు పోరాటంకే దక్కిందన్నారు. నాటి అమరుల స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నికరంగా పని చేయడమే అమరులకు నిజమైన నివాళు లన్నారు. అనంతరం పాలకోడేరు ప్రజాసంఘాల కార్యాలయంలో గాదిరాజు శ్రీరామరాజు చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ్య పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామరాజు కుమారుడు గాదిరాజు సూర్యనారాయణరాజు, బత్తిన నాగేశ్వరరావు, చెల్లబోయిన సింహాచలం, కలిదిండి గోపాలరాజు, దున్న మరియమ్మ, కిలారు లక్ష్మి, షాలిని, కె.జ్యోతి పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు చిహ్నాలు పండుగలు

ఆర్‌టిఒ ఉమామహేశ్వరరావు

భీమవరం రూరల్: సంస్కృతీ, సంప్రదాయాలకు చిహ్నాలు పండుగలని రవాణా శాఖాధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను మంగళవారం నిర్వహించారు. తొలుత శోభాయాత్ర నిర్వహించారు. ముఖ్యఅతిథి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మన ప్రాచీన సంప్రదాయాలు కనుమరుగయ్యాయన్నారు. ఈ వేదికపై ఆనాటి ప్రాచీన కళలైన జంగందేవర, పిట్టల దొర, కొమ్మ దాసరి, బుర్రకథ, ఇంద్రజాలం, భరతనాట్యం తదితర ప్రదర్శనలు ఎంతో ఆనందాన్నిచ్చాయన్నారు. డిఇఒ ఆర్.వెంకటరమణ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి పి.సుజాతరాణి, జిల్లా ఖజానాధికారి జి.గణేష్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలు లలిత కళలతోనే ముడిపడి ఉన్నాయన్నారు. విశిష్ట సేవలందించిన వారికి సమాజంలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కుల, మత రహితంగా ఈ ఉగాది అవార్డులు అందించడం అమోఘమన్నారు. రాష్ట్ర మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వడుపు గోపి, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, కనుమూరి సత్యనారాయణరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి.రమణ వరుసగా గ్రహీతలకు అవార్డులు అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 39 ఏళ్లుగా అందరి సహకారంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. 66 మందికి ఉగాది పురస్కారాలు, 54 మంది విద్యార్థులకు రెడ్‌క్రాస్ సంస్థ సౌజన్యంతో ప్రశంసా పత్రాలు అందించామని తెలిపారు. ఎస్‌టిఒ అల్లూరి రవివర్మ, ఆర్‌టిసి డిఎం సత్యనారాయణమూర్తి, సర్ సివి రామన్ స్కూల్ డైరెక్టర్ రావణం వేణుగోపాల్, ప్రిన్సిపల్ పెండ్యాల సరిత పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నేతలు, కుటుంబ సభ్యులు

సిపిఎం నేత భరద్వాజ్ సేవలు ఎనలేనివి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

తుదిశ్వాస విడిచే వరకు మిలటరీ క్రమశిక్షణతో పేద ప్రజల అభ్యున్నతికి సిపిఎం నేతగా పని చేసిన భరద్వాజ్ సేవలు ఎనలేనివని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. వత్సవాయి భరద్వాజ్ 30వ వర్ధంతి సభ భీమవరం శ్రీ వైభవ్ అపార్టుమెంట్‌లోని ఆయన నివాసంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరద్వాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బలరాం, గోపాలన్ మాట్లాడుతూ భరద్వాజ్ సైన్యంలో పని చేసి రిటైర్‌మెంట్ అనంతరం నరసాపురం తాలూకాలో ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని అందరి మన్ననలు పొందారన్నారు. భరద్వాజ్ మన మధ్య లేకపోవడం సిపిఎం ఉద్యమానికి తీరని లోటన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సమయపాలన, పేదల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే పోరాటాల్లో ఉక్కు క్రమశిక్షణతో రాజీ లేని పోరాటాలు నిర్వహించారన్నారు. ఆచంటలో భరద్వాజ్ పేరుతో ప్రజా ఉద్యమాల కేంద్రంగా కార్యాలయం నిర్మాణమైందన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భరద్వాజ్ సతీమణి వత్సవాయ సత్యవతి, కుటుంబ సభ్యులు కలిదిండి రాధ, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా నాయకురాలు జె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న క్రాంతిబాబు

శ్మశాన వాటికను ఎరుకులకు అప్పగించాలి: కెవిపిఎస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఎరుకుల శ్మశాన వాటికను సర్వే చేసి వారికి అప్పగించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. మిలట్రీ మాధవరం గ్రామంలోని ఎరుకల శ్మశాన వాటికను మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ఆధ్వర్యంలో కెవిపిఎస్ జిల్లా బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినా నేటికీ ఎస్‌సి, ఎస్‌టిలు అభివృద్ధిలో వెనుకబడే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరుకలపేటలో సుమారు 40 కుటుంబాలు సుమారు 50 ఏళ్లు పైబడి జీవిస్తున్నారని తెలిపారు. అక్కడి ప్రజలకు శ్మశాన వాటిక ఉన్నా దాన్ని వినియోగించుకునే పరిస్థితి లేదని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నపించుకున్నా కనీసం స్పందన లేదని ఆరోపించారు. సోమరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ మాట్లాడుతూ తక్షణమే అధికారులు స్పందించి ఎరుకుల శ్మశాన వాటికను సర్వే చేసి, ప్రహరీ నిర్మించి వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు, నాయకులు కె.ప్రసాద్, పి.జయమ్మ, గ్రామస్తులు ఎన్.వయ్యేరి, ఎరుకల సంఘం అధ్యక్షులు చినమర్తి శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.